క్లుప్తంగా

నేడు కాంగ్రెస్ శ్రేణుల బైక్ ర్యాలీ

కైలాస్‌నగర్: పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి సీఎంగా బాధ్యతలు చేపట్టడం, కాంగ్రెస్ అధినేత్రి సోనియా గాంధీ జన్మదినాన్ని పురస్కరించుకుని ఈనెల 9న ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు కాంగ్రెస్ నాయకుడు కంది శ్రీనివాస రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10:30 గంటలకు మావల బైపాస్ వద్ద నుంచి పట్టణ ప్రధాన వీధుల గుండా అంబేద్కర్ చౌక్ వరకు సాగుతుందన్నారు. కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో తరలివచ్చి జయప్రదం చేయాలని కోరారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

తాంసి: ప్రజలు దోమలు వృద్ధి చెందకుండా పరిసరాల పరిశుభ్రత పాటించాలని భీంపూర్ హెచ్ఈవో జ్ఞానేశ్వర్ అన్నారు. శుక్రవారం మండలంలోని అర్లి(టి) గ్రామంలో డ్రై డే కార్యక్రమాన్ని నిర్వహించారు. వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ప్రజలకు అవగాహన కల్పించారు. ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. అపరిశుభ్రంగా ఉన్న కాలనీల్లో పారిశుధ్య సిబ్బందిచే క్లోరినేషన్ పనులు చేయించారు. వారి వెంట వైద్య సిబ్బంది గంగాధర్, దివ్య, కార్యదర్శి రవికాంత్, ఆశ కార్యకర్తలు సాజిద, గంగుబాయి ఉన్నారు.

నష్ట పరిహారం చెల్లించి ఆదుకోవాలి

ఎదులాపురం: వాతావరణ ప్రభావం, అకాల వర్షాలు, తుఫాన్ కారణంగా నష్టపోయిన రైతులకు పరిహారం చెల్లించి ఆదుకోవాలని సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా జిల్లా నాయకులు జగన్ సింగ్ డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం మాట్లాడారు. జిల్లాలో వరి, పత్తి, కంది (తొగరి) పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందని, వేల ఎకరాలలో పంటలు కోత దశలో నీట మునిగియన్నారు. ఆరబోసిన ధాన్యం తడిసి మొలకెత్తిందని, పత్తి పంట రంగుమారి పనికిరాకుండా పోయిందన్నారు. ప్రభుత్వం పంట నష్టం అంచనా వేసి ఎకరం వరికి రూ.40 వేలు, పత్తికి రూ. 80 వేలు పరిహారం అందించాలని కోరారు. కార్యక్రమంలో ప్రజాపంథా నాయకులు సాయికుమార్, వినోద్, అశోక్, రవీందర్, నితీన్, మడావి రవి పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం


పల్లకి ఊరేగిస్తున్న భక్తులు

ఇచ్చోడ: మండల కేంద్రంలోని అయ్యప్ప ఆలయ వార్షికోత్సవాన్ని శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం 6 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉత్సవ విగ్రహాన్ని మండల కేంద్రంలోని ప్రధాన వీధులు గుండా ఊరేగించారు. ఊరేగింపు అనంతరం విగ్రహాన్ని కుప్టి వద్ద కడెం నదిలో చక్ర స్నానం చేయించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

విద్యార్థులకు మాక్ టెస్టు

ఆదిలాబాద్‌రూరల్: ఈనెల 10న నేషనల్ మిన్స్ కం మెరిట్ స్కాలర్‌షిప్ టెస్టు (ఎన్ఎంఎంఎస్) పరీక్ష ఉన్నందున ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ మోడల్ స్కూల్ విద్యార్థులకు శుక్రవారం మాక్ టెస్టు నిర్వహించారు. ఈసందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ సుధారాణి మాట్లాడుతూ.. 2023–24 విద్యా సంవత్సరంలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థులు ఎన్ఎంఎంఎస్ పరీక్ష రాసే అవకాశం ఉందన్నారు. పరీక్షలో ఎలాంటి తప్పులు చేయకుండా ఉండేందుకు ముందస్తుగా మాక్ టెస్టు నిర్వహించడం జరిగిందన్నారు.

అయ్యప్ప స్వాములకు బిక్ష ఏర్పాటు చేసిన ముస్లిం వ్యక్తి

తాంసి: భీంపూర్ మండలంలోని పిప్పల్ కోటి గ్రామంలో శుక్రవారం గ్రామానికి చెందిన ముస్లిం వ్యక్తి షేక్ మతీన్ అయ్యప్ప స్వామి దీక్ష పరులకు బిక్ష కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. పిప్పల్ కోటి గ్రామంలో హిందూ ముస్లింలు ఐక్యంగా పండుగలు జరుపుకుంటూ.. ఆదర్శంగా నిలుస్తున్నారు. అయ్యప్ప స్వాములతో కలిసి పూజలు చేశాడు.

'కాంగ్రెస్‌తోనే అభివృద్ధి'

సిరికొండ: కాంగ్రెస్‌తోనే తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి సాధ్యమని ఆల్ ఇండియా క్రిస్టియన్ ఫెడరేషన్ ఆదిలాబాద్ జిల్లా పార్లమెంట్ పరిశీలకులు సదానందం అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. దళిత క్రైస్తవులు 90 శాతం పైగా ఓటర్లు కాంగ్రెస్‌కు ఓటు వేశారని తెలిపారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు షేక్ ఇమామ్, మైనార్టీ సెల్ చైర్మన్ ఎండీ రంజాన్, ప్రధాన కార్యదర్శి బోద్దు నవీన్, సీనియర్ నాయకులు సాజిద్, మున్వర్, రాము, తదితరులు పాల్గొన్నారు.

కొత్త ఎమ్మెల్యేలు.. పాత సమస్యలు

- మండల అభివృద్ధిపై ప్రజల ఆశలు
- ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చిన నేతలు


రీ డిజైన్ చేయాల్సిన చికమాన్ ప్రాజెక్టు ఇదే..


వాయిపేట్‌కు వెళ్లే మట్టిరోడ్డు

సిరికొండ: ఎన్నికలు ముగిశాయి. నూతన ప్రభుత్వం ఏర్పాటు అయింది. కొత్తగా ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. కానీ మండలంలో పాత సమస్యలు అలాగే ఉన్నాయి. రెండు నియోజకవర్గంలో ఉన్న సిరికొండ మండలాన్ని ఇద్దరు ఎమ్మెల్యేలు అభివృద్ధి చేయాలని మండలవాసులు కోరుతున్నారు.

ప్రధాన సమస్యలే.. ఎన్నికల హామీలు..

ఇటీవల జరిగిన శాసనసభ సాధారణ ఎన్నికల్లో పోటీ చేసిన ప్రధాన పార్టీల ఎమ్మెల్యే అభ్యర్థులు మండలం లో ఉన్న ప్రధాన సమస్యలను పరిష్కరిస్తామని హామీలు ఇచ్చారు. ఇందులో ప్రధాన సమస్యలు చికమాన్ ప్రాజెక్టును రీ డీజైన్ చేసి గేట్లు అమర్చి పంటలకు సాగు నీరు అందించాలి. గిరిజన గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించాలి. అలాగే తాగునీరు సమస్య లేకుండా చూడాలి. సిరికొండ నుంచి వాయిపేట్ గ్రామం వరకు బీటీ రోడ్డు వేయాలి. పలు గ్రామాల వాగులపై వంతెనలు నిర్మించాలని మండల ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యాలయాల ఏర్పాటు..

సిరికొండ మండలంలో ప్రభుత్వం కార్యాలయాలు ఏర్పాటు చేసింది. కానీ వాటికి పక్కా భవనాలు నిర్మించ లేదు. ఒక్క కార్యాలయానికి కూడా సొంత భవనం లేకపోవడంతో ప్రజలు, సిబ్బంది ఇబ్బంది పడుతున్నారు. గత కొద్ది సంవత్సరాలుగా పక్కా భవనాలు నిర్మించాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నా.. పట్టించుకునే నాథుడే లేదని ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం మండలానికి నిధులు కేటాయించి, అభివృద్ధి చేస్తుందని ప్రజలు ఆశగా ఎదురు చూస్తున్నారు.

రోడ్డు నిర్మాణం చేపట్టాలి



మండలంలోని ప్రధాన సమస్యల్లో ఒకటైన వాయిపేట్ బీటీ రోడ్డు నిర్మాణం చేపట్టాలి. మండలంలోని ప్రతీ గిరిజన గ్రామాల్లో మౌలిక వసతులు ఏర్పాటు చేయాలి. నూతనంగా ఎన్నికైన ఎమ్మెల్యేలు మండల అభివృద్ధికి కృషి చేయాలి.

– పెందుర్ అమృత్‌రావు, ఎంపీపీ

రీ డిజైన్ చేయాలి



మండలంలోని ప్రధాన సాగు నీటి వనరు అయిన చికమాన్ ప్రాజెక్టును రీ డిజైన్ చేయాలి. అప్పుడే రైతులకు సాగునీరు అందుతుంది. ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన నాయకులు నెరవేర్చాలి. నూతనంగా ఏర్పాటైన ప్రభుత్వంపై ప్రజలు ఆశలు పెట్టుకున్నారు.

– సాయిని స్వామి, యువసేన అధ్యక్షుడు

లింకు రోడ్లు నిర్మించాలి



మండల కేంద్రాన్ని కలుపుతూ.. గ్రామాలకు లింకు రోడ్లు నిర్మించాలి. దీంతో ప్రజలకు రవాణా కష్టాలు తీరుతాయి. అలాగే రోడ్ల నిర్మాణం, వాగులపై వంతెనలు నిర్మించాలి. గ్రామాల్లో మౌలిక వసతులు కల్పించాలి.

– మోరె నీలకంఠ, రాంపూర్

ఆదివాసీలకు న్యాయం చేయాలి


మాట్లాడుతున్న సిడాం రాంకిషన్

ఎదులాపురం: ఎమ్మెల్యేలుగా గెలిచిన పాయల్ శంకర్, వెడ్మబొజ్జు, ఎంపీ సోయం బాపురావులు ఆదివాసీల సమస్యలను పరిష్కరించి, న్యాయం చేయాలని మేలుకో ఆదివాసీ ప్రధాన్ సమాజ్ జిల్లా నాయకులు సిడాం రాంకిషన్ డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆదివాసీల సమస్యల పరిష్కరంతో పాటు న్యాయమైన 10 డిమాండ్లను నెరవేర్చాలన్నారు. ఈదిశగా పార్లమెంట్, రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లాలని కోరారు. కార్యక్రమంలో సమాజ్ నాయకులు మెస్రం గంగాదేవి, పొచ్చిరాం, దుర్వ ప్రదీప్, తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే అనిల్‌జాదవ్ ప్రత్యేక పూజలు


పూజలు చేస్తున్న ఎమ్మెల్యే అనిల్‌జాదవ్

బోథ్: మండలంలోని నిగిని గ్రామపంచాయతీ పరిధిలోని కైలాస్ టెకిడి సర్వదేశ్వర ఆలయంలో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ శుక్రవారం ప్రత్యేక పూజలు చేశారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ త్వరగా కోలుకోవాలని, తెలంగాణ ప్రజలు సుఖ సంతోషాలతో మొక్కుకున్నారు. అంతకు ముందు మండల కేంద్రంలోని సాయి బాబా ఆలయంలో పూజలు చేశారు.

చట్టాలపై అవగాహన అవసరం


అవగాహన కల్పిస్తున్న సిబ్బంది

ఇంద్రవెల్లి: మహిళలకు, యువతులకు, విద్యార్థినులకు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని సఖీ కేంద్రం నిర్వాహకురాలు లావణ్య, నాగమణి, మహిళ సాధికారత సమన్వయ కర్త యశోదలు అన్నారు. శుక్రవారం ఇంద్రవెల్లి కేజీబీవీ పాఠశాలతో పాటు మండలంలోని ముత్నూర్ జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినులకు అవగాహన కల్పించారు. బేటీ బచావో బేటీ పడావో, గుడ్ టచ్, బ్యాడ్ టచ్ గురించి వివరించారు. లైంగిక, శారీరక, మానసిక, ఆర్థిక పరమైన వేధింపులకు లోనైనప్పుడు ఆందోళన చెందకుండా ధైర్యంగా ఉండాలన్నారు. గృహ హింస చట్టం, సఖీ కేంద్రం సేవలు, సైబర్ క్రైంపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆదిలాబాద్‌టౌన్: పట్టణంలోని రిమ్స్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనులు చేపట్టనున్నందు న ఈ నెల 9న రిమ్స్ ఆసుపత్రితో పాటు కలెక్టరేట్‌చౌక్, సప్తగిరి కాలనీ, ఓల్డ్ హౌసింగ్‌బోర్డు, కైలాస్‌నగర్, టీచర్స్ కాలనీ, సంజ య్‌నగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఆదిలాబాద్ టౌన్–3 ఏఈ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందని పేర్కొన్నారు. అలాగే భుక్తాపూర్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతుల కారణంగా భుక్తాపూర్, మోచిగల్లి, ద్వారకానగర్, విద్యానగర్ ఏరియాలో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని తెలిపారు. వినియోగదారులు విషయాన్ని గమనించాలని సూచించారు.

ఆదిలాబాద్‌రూరల్: విద్యుత్ తీగల మరమ్మతుల కారణంగా శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలంలోని బంగారుగూడ, పిప్పల్‌ధరి, అంకోలి సబ్ స్టేషన్ పరిధిలలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని మండల విద్యుత్ శాఖ అధికారి తిరుపతి రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

బోథ్: బోథ్, పొచ్చెర సబ్‌స్టేషన్‌లలో మరమ్మతుల కారణంగా శనివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి 5 గంటల వరకు ఆయా సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని విద్యుత్ శాఖ ఏఈ వెంకటేష్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

'కార్యకర్తలు అధైర్యపడొద్దు'


ఎమ్మెల్యేను కలిసిన నాయకులు, కార్యకర్తలు

నార్నూర్: కార్యకర్తలు అధైర్య పడొద్దు అండగా ఉంటానని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. శుక్రవారం ఆమె స్వగృహంలో ఎంపీపీ కనక మోతుబాయి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు ఆమెను కలిసి సన్మానించారు. బీఆర్ఎస్ కార్యకర్తల సమిష్టి కృషితోనే భారీ మెజార్టీతో విజయం సాధించడం జరిగిందన్నారు. అధికారంలో బీఆర్ఎస్ ప్రభుత్వం లేదని ఎవరూ ఆందోళన చెందవద్దన్నారు. ఎలాంటి కష్టం వచ్చినా.. నేనున్నానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ జాదవ్ చంద్రశేఖర్, సర్పంచ్‌ల సంఘం మండలాధ్యక్షుడు ఉర్వేత రూప్‌దేవ్, సయ్యద్‌ఖాశీం, రాథోడ్ రమేశ్, రూప్‌దేవ్, పరమేశ్వర్, రాహుల్, తదితరులు పాల్గొన్నారు.

'రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దు'

తలమడుగు: తలమడుగు పంచాయతీ పరిధిలోని ఎస్ఎల్ 23 నంబర్ గల రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మించొద్దని గ్రామస్తులు, సభ్యులు తీర్మానం చేశారు. రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణం కోసం అధికారులు పంచాయతీ తీర్మానం కోరగా.. శుక్రవారం సర్పంచ్ కరుణాకర్ రెడ్డి అధ్యక్షతన గ్రామసభ నిర్వహించారు. నిర్మించవద్దంటూ సభ్యులు, గ్రామస్తులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. సర్పంచ్ మాట్లాడుతూ.. ఖోడద్, ఉండం గ్రామాల రైల్వే అండర్ బ్రిడ్జి నిర్మాణాలు అసంపూర్తిగా నిర్మించడంతో నీరు నిల్వ ఉంటుందన్నారు. తలమడుగు, రుయ్యాడి గ్రామాల వద్ద రైల్వే బ్రిడ్జిల నిర్మాణాలు చేపట్టవద్దని తీర్మానం చేసి ఉన్నతాధికారులకు పంపించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అశోక్, వార్డుసభ్యులు లింగన్న, రవి, గ్రామస్తులు శివ, శ్రీకాంత్, పద్మాకర్, అశోక్ పాల్గొన్నారు.

ప్రమాదం.. ప్రయాణం



సిరికొండ: మండలంలోని కొండాపూర్ గ్రామ సమీపంలోని వంతెన వద్ద అప్రోచ్ రోడ్డు కొట్టుకుపోవడంతో తాత్కాలికంగా మొరం పోశారు. ఆ మొరం ఎత్తుగా మారడంతో వాహనాలు ప్రమాదానికి గురవుతున్నాయి. దీంతో ప్రయాణికులు భయాందోళన చెందుతున్నారు. అధికారులు స్పందించి వంతెన పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.

సమయపాలన పాటించని అధికారులు


అధికారుల కోసం ఎదురుచూస్తున్న గిరిజనులు


సిబ్బంది లేక ఖాళీగా ఎంపీడీవో కార్యాలయం

- కార్యాలయాల వద్ద ప్రజల పడిగాపులు
- పరిష్కారం కాని సమస్యలు

నార్నూర్: ఏజెన్సీ ప్రాంతంలోని గిరిజనులకు పాలన సౌలభ్యం కోసం గత ప్రభుత్వం గాదిగూడను మండలంగా ఏర్పాటు చేసింది. అన్ని శాఖలకు అధికారులను నియమించింది. కానీ అధికారులు సమయపాలన పాటించక పోవడంతో ప్రజలు కార్యాలయాల వద్ద పడిగాపులు పడుతున్నారు. వివిధ శాఖల అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడంతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. శుక్రవారం ఎంపీడీవో రామేశ్వర్‌తో పాటు సిబ్బంది సమయపాలన పాటించకపోవడంతో ఖాళీ కుర్చీలతో కార్యాలయం వెలవెల బోయింది. వార్కాయి, ఖడ్కి, అర్జీయాన్, హీరాపూర్ గ్రామాల నుంచి మహిళలు ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు వేచి చూశారు. కార్యాలయం వద్ద నిరీక్షించారు. అయినా.. అధికా రులు, సిబ్బంది రాకపోవడంతో నిరాశతో వెనుతిరి గారు. సంబంధిత అధికారులు స్పందించి అధికారులు సమయపాలన పాటించేలా చర్యలు తీసుకోవాలని గిరిజనులు కోరుతున్నారు.

తెరుచుకున్న బెల్ట్‌షాపులు

- ఎన్నికల కోడ్ ఎత్తివేయడంతో మళ్లీ మొదలైన దందా


ఇటీవల పట్టుకున్న మద్యం (ఫైల్)

ఇచ్చోడ: బెల్ట్‌షాపుల దందా మళ్లీ మొదలైంది. ఇటీవల ఎన్నికల కోడ్ ఉండడంతో పోలీసులు బెల్ట్ దుకాణాలపై దాడులు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కొన్నిచోట్ల బెల్ట్ నిర్వాహకులపై కేసులు నమోదు చేశారు. బెల్ట్‌షాపులు మూత పడడంతో ప్రజలు సంతోషించారు. కానీ ఎన్నికలు ముగిసిన తరువాత మళ్లీ బెల్ట్‌షాపుల దందా మొదలైంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కన్న ముందే గ్రామాల్లో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. మండల వ్యాప్తంగా దాదాపు 150 బెల్ట్ షాపులు ఉన్నట్లు సమాచారం ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోక ముందే బెల్ట్ దుకాణాలు తెరుచుకోవడంపై మహిళలు, కాలనీవాసుల నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈవిషయంపై ఇచ్చోడ ఎక్సైజ్ సీఐ రాజమౌళిని వివరణ కోరగా.. ప్రభుత్వం నుంచి ఎలాంటి ఆదేశాలు రాలేదన్నారు.

పంటలపై వాతావరణ ప్రభావం

- ఆందోళనలో రైతులు
- సలహాలివ్వని వ్యవసాయాధికారులు


చేనులో తడిసిన పత్తి

గుడిహత్నూర్: మండలంలో గతంతో పోలిస్తే రైతుల సంఖ్య పెరిగింది. ప్రభుత్వ ప్రోత్సాహక పథకాలు, నిరుద్యోగం కారణంగా వ్యవసాయం చేసేందుకు మొగ్గు చూపుతున్నారు. కాగా రైతులు భారీగా పెట్టుబడులు పెడుతూ.. పంట చేతికి వచ్చే వరకూ ఎన్నో ఇబ్బందులు పడుతున్నారు. పంటను కన్న బిడ్డలా కాపాడుతూ వస్తున్నారు.

గతంలో అతివృష్టితో..

సాగు చేస్తున్న క్రమంలో గతంలో అధిక వర్షాలతో అతివృష్టి ఏర్పడి దిగుబడిపై ప్రభావం చూపింది. దీన్ని అధిగమించేందుకు నానా అవస్థలు పడుతున్నారు. తమ చేలలో నీటిని తోడేసి పంటను కాపాడుకున్నారు. పోయింది పోనిలే.. మిగిలి పంటను కాపాడుకుందాం అంటూ.. సస్యరక్షణ చర్యలు చేపట్టారు. చివరగా పత్తి పంట ఏరుకునే తరుణంలో కూలీలు సకాలంలో దొరకక పంట ఇంటికి చేరలేదు. కూలీలు దొరికిన వాతావరణ పరిస్థితులు ఆటంకంగా మారాయి.

నష్టాల వైపు మళ్లిస్తున్న మిచాంగ్ తుపాను..

పంట ఇంటికి చేరే దశలో మిచాంగ్ తుపాన్ విపత్తు వచ్చి పడింది. గత మూడు రోజులుగా కురుస్తున్న తేలిక పాటి వర్షం, పొగమంచుతో పత్తి, కంది, శనగ, కూరగాయల పంటలు దెబ్బతిన్నాయి. ఈ పరిస్థితులు ఎదురవడంతో రైతన్నలు మానసిక క్షోభకు గురువుతున్నారు. ఇంటికి చేరాల్సిన పత్తి చేలలోనే తడిసి ముద్దవుతోంది. పూత, కాత దశలో ఉన్న కంది తెగుళ్ల బారిన పడుతోంది. పొగమంచు కారణంగా శనగ పంట దెబ్బతింటుంది. దీంతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

పత్తాలేని అధికారులు..

రైతులకు ఏ సమస్య వచ్చినా.. అందుబాటులో ఉండాల్సిన అధికారులు గతంలో జరిగిన నష్టాలపై పూర్తి స్థాయిలో సర్వే నిర్వహించక పోగా.. గత నాలుగైదు రోజులుగా వర్షం, పొగమంచుతో దెబ్బతింటున్న పంటలను ఏ విధంగా కాపాడుకోవాలి అనే సలహాలు కూడా ఇవ్వడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిని అధిగమించేందుకు ఫర్టిలైజర్ దుకాణాల బాట పడుతున్నారు. ఎలాగైనా తమ పంటలను రక్షించుకోవాలని భారీగా పెట్టుబడులు పెడుతున్నారు.

పత్తి తడిసింది



ఇన్ని రోజులు కూలీలు దొరకక ఇబ్బంది పడ్డాం. ఇప్పుడిప్పుడే కూలీలు వస్తున్న తరుణంలో వాతావరణ పరిస్థితుల వల్ల పంట తడిసింది. దానికి ఏ రేటు పలుకుతుందోనని బెంగగా ఉంది.

– ఉత్తమ్, రైతు, కొల్హారి

పంటలకు తెగుళ్లు



వాతావరణం కారణంగా కంది పూత రాలి తెగుళ్ల బారిన పడింది. మందులు పిచికారీ చేస్తున్నాం. ఎంత వరకు ఫలిస్తుందో తెలియదు. ఇలాంటి పరిస్థితి రావడంతో పెట్టుబడి ఖర్చులు పెరిగి పోతున్నాయి.

– సాతాశే అశోక్, రైతు, గుడిహత్నూర్

108లో ప్రసవం

సిరికొండ: మండలంలోని రిమ్మ గ్రామానికి చెందిన గర్భిణి లక్ష్మి శుక్రవారం పురిటినొప్పులతో బాధపడుతుండగా.. కుటుంబసభ్యులు గమనించి 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది తక్షణమే స్పందించి ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో సిరికొండలో మగ బిడ్డకు జన్మనిచ్చింది. మెరుగైన చికిత్స కోసం ఇచ్చోడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. తల్లీబిడ్డలు క్షేమంగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఈఎంటీ కాశీనాథ్, పైలెట్ గోపీనాథ్ ఉన్నారు.

యూడైస్‌లో వివరాలు నమోదు చేయాలి

బోథ్: పాఠశాలకు సంబంధించిన విద్యార్థుల వివరాలను కచ్చితంగా యూడైస్‌లో నమోదు చేయాలని ఎంఈవో భూమారెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతువేదికలో ప్రధానోపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. యూడైస్‌పై పలు సూచనలు చేశారు. ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.